ఆంధ్రభూమి 13-6-91

## రిజర్వాయర్ నిర్మాణాన్ని నిరసిస్తూ

# ఓట్ల బహిష్కరణకు గిరిజనుల నిర్ణయం

రంపచోడవరం, జూన్ 12 (న్యూస్ ఫ్లాష్): భూపతిపాలెం వద్ద సీతపల్లి వాగుపై నిర్మిస్తున్న రిజర్వాయర్ వల్ల ముంపుకు గురయ్యే భూపతిపాలెం, గాంధీనగరం, లంకపాకలు, చిన్న గెద్దాడ గ్రామాల గిరిజనులు 15వ తేదిన జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనబోమని ప్రకటించారు. ఈ నాలుగు గ్రామాల్లో 836 మంది గిరిజనులు భూపతిపాలెం రిజర్వాయర్ 'బాధితుల సంఘం పేర ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వం తమతో సంప్రదించకుండా తమను ముంపు గ్రామాల్లో చేరుస్తూ ఏక పక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

1,134 ఎకరాల భూమి, ఫలసాయం ఇచ్చే చింతచెట్లు, జీడిమామిడి చెట్లు, తాడిచెట్లు 28,258 ఉన్నాయని, ఇవే కాక సర్వే కాని కొండపోడు భూములు ఉన్నాయని ముంపువలన పై మొత్తం ఆస్తి గిరిజనులు నష్ట పోవలసి వస్తుందని బాధితులు వివరించారు. ఎనిమిదేళ్ల క్రితం ఈ రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం ప్రతిపాదనలు చేయగా నిర్మాణం నేటికీ ప్రారంభం కాకుండానే సుమారు నాలుగేళ్లుగా ఈ ముంపు గ్రామాల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం మానివేసిందని ఫలితంగా నిరక్షరాస్యత పెరిగిందని వారు ఆరోపిస్తున్నారు. భూపతిపాలెం గ్రామస్తులు విలేఖరులతో మాట్లాడుతూ తమ గ్రామంలో 15 మంది బాల బాలికలు ఉన్నప్పటికీ ఐ టి డి ఎ టీచరుగాని, అంగన్‌వాడీ కేంద్రాన్ని గాని తెరవలేదని, పక్కా గృహాల నిర్మాణం , వయోజన విద్యా కేంద్రం వంటివి ఏర్పాటు చేయలేదని వీటిగురించి ప్రశ్నిస్తే ముంపు గ్రామమని అధికారులు అంటున్నారని వారు పేర్కొన్నారు.

భూపతిపాలెం రిజర్వాయర్ నిర్మించి తమను ఈ ప్రాంతం నుండి తరిమివేయవలసిన అవసరం అంతగా లేదని వారు అభిప్రాయపడుతున్నారు. నిర్మించబోయే రిజర్వాయర్ క్రింద ఇప్పటికే అనేక నీటి వనరులు ఉండటాన్ని గ్రామస్తులు విలేఖరుల దృష్టికి తెచ్చారు. ఊళ్లగ్రామంలో పెద్ద చెరువు, రాంబుల చెరువు, ఉసరి దొన్నలో దువ్వల మెట్ట చెరువు, కుంజం వీదిలో కలుం వారి కుంట చెరువు, గంగవరంలో పరిచెరువు, పాలెంచెరువు, మర్రివాడలో క్రొత్త చెరువు, రంపలోని పాతచెరువు, చెరువుపాలెం గ్రామంలోని పెద్ద చెరువులు ఉన్నాయి. ఇటువంటి చెరువుల మరమ్మత్తులు చేపడితే రిజర్వాయర్ నిర్మించకుండానే దాని లక్ష్యాన్ని మించి ఎక్కువ భూమి నికరంగా సాగులోకి తేవచ్చునని లెక్కలతో ఉదాహరిస్తున్నారు. ముంపు గ్రామాల గిరిజనులను ఇక్కడకు 30 కిమీ దూరాన గల చంద్రపుట్టపాలెం తరలించి కుటుంబానికి ఒక ఎకరం చొప్పున పొలం నష్టపరిహారంగా ఇవ్వాలని ఆలోచిస్తుందని కానీ తమ భూములను వదులుకొని వేరేచోట భూములు తీసుకోవటానికి తాము అంగీకరించేదిలేదని స్పష్టం చేశారు. తమతో సంప్రదించకుండా ప్రభుత్వం తీసుకొనే ఏ నిర్ణయానికి తమ మద్దతు ఉండదని చెప్పటానికే పార్లమెంట్ ఎన్నికల్లో తాము పాల్గొనటం లేదని వారు వివరించారు.

రిజర్వాయర్ల నిర్మాణంలో గత అనుభవాలు బేరీజు వేసుకుంటే మద్దిగెడ్డ రిజర్వాయర్ క్రింద మునిగి తరలింపబడిన బందకొండ గ్రామంలో నేటికీ మంచినీటి సౌకర్యం కల్పించలేకపోయిందని ఏలేరు ముంపు బాధితుల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా తయారైందని వారు విమర్శించారు. ముంపు నష్టాన్ని, నిర్వాసితుల 'పునరావాసాన్ని, రిజర్వాయర్ వల్ల వచ్చే లాభాన్ని గూర్చి ప్రభుత్వం అంచనా తప్పతడకలని భూపతిపాలెం నిర్వాసితులు వాదిస్తున్నారు.